క్లుప్తంగా

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు స్పందన


ప్రయాణికుల సమస్యలు తెలుసుకుంటున్న డీఎం షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలను తెలియజేశారన్నారు. సుమారు 14 మంది తమ సమస్యలను వెల్లడించారన్నారు. దొంతమూరు నుంచి మండపేట, రామచంద్రపురం, రాజమహేంద్రవరానికి బస్సు కావాలని, కోరుకొండ నుంచి రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు బస్సు నడపాలని, కోరుకొండలో విద్యార్థులకు బస్సులు ఆపడం లేదని, రాజమహేంద్రవరం–భీమవరం వయా ఉండ్రాజవరం మీదుగా బస్సు సర్వీసు కావాలని కోరారన్నారు. అలాగే రాజమహేంద్రవరంలో సిటీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

మైక్ సెట్ వితరణ


మైక్ సెట్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కడియం: మండలంలోని దుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మైక్ సెట్‌ను వితరణ చేశారు. బుధవారం హైస్కూల్లో జరిగిన ఓ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన రాజేంద్ర, యర్రా పోతేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ నూలు సోమేశ్వర్.. ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణికి అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: కాతేరు గామన్ బ్రిడ్జి పిల్లర్ 22 వద్ద గుర్తుతెలియని 50 నుంచి 60 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని మూడో పట్టణ పోలీసులు బుధవారం గుర్తించారు. అతడి ఒంటిపై ఖాకీ రంగు ఫుల్‌హ్యాండ్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు మూడో పట్టణ పోలీసులను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వైఎంఏ హాలులో అండర్ – 7 బాలబాలికల విభాగంలో చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. బాలుర విభాగంలో ఎస్.సాయి విభు, పి.కార్తికేయ, బాలికల విభాగంలో డి.ఆధ్య, ఏ.వేదాన్షి విజయం సాధించారు. విజేతలు జూలై 28 నుంచి 30 వరకూ విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించాలని వక్తలు ఆకాంక్షించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా దుళ్ల హైస్కూల్లో బుధవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పదిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను సత్కరించి నగదు బహుమతులను అందజేశారు. హెచ్‌ఎం పి.సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్కూలు చైర్మన్ నూలు సోమేశ్వరరావు, వైస్ చైర్మన్ గుంటూరి లక్ష్మి, కోఆప్టెడ్ సభ్యులు కంటిపూడి సాయి పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

కంబాలచెరువు: విద్యాహక్కు చట్ట ప్రకారం కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య పొందుతున్న వెనుకబడిన వర్గాలు, అనాథలు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలను మిగతా పిల్లలు వివక్షతతో చూడరాదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఒకటో తరగతిలో అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు వీరికి కేటాయించారన్నారు. వారికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, లైబ్రరీ, ఐసీటీ సౌకర్యాలు కల్పించాలన్నారు.

టీడీపీ నాయకుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచుతూ పేదలను తీవ్ర ఇబ్బందులు పెడుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

24న ఎంపికలు

మధురపూడి: కడపలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో 4, 5 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 24న కోరుకొండ మండలం దోసకాయలపల్లి హైస్కూల్ మైదానం ఎంపికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 8 నుంచి పదేళ్ల లోపు విద్యార్థులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

ఆధునీకరిస్తే ఆయకట్టు బంగారమే..

- శిథిలావస్థలో పంపింగ్ స్కీమ్
- రూ. 3.20 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు


60 హెచ్‌పీ మోటార్లు


పాత వెంకటనగరం పంపింగ్ స్కీమ్

రాజమహేంద్రవరం రూరల్: పాత వెంకటనగరం పంపింగ్ స్కీమ్ నుంచి ప్రతి ఏడాదీ ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీరందిస్తున్నారు. అయితే స్కీమ్ శిథిలావస్థకు చేరడంతో చివరి వరకూ నీరందడం లేదు. అలాగే నీరు వెళ్లేందుకు కాలువలను సైతం ఆధునీకరించాల్సిన అవసరం ఉంది. రైతుల అభ్యర్థన మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీజీ అండ్ బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్ రూ.3.20 కోట్లతో పాత వెంకటనగరం పంపింగ్ స్కీమ్‌ను ఆధునీకరించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.

1966లో స్కీమ్ నిర్మాణం

వెంకటనగరం, కాతేరు, తొర్రేడు, కొంతమూరు, గాడాలలోని ఆయకట్టుకు నీరందించేందుకు 1966లో మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు పాత వెంకటనగరం పంపింగ్ స్కీమ్‌ను నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ పంపింగ్ స్కీమ్ ద్వారా ఖరీఫ్‌లో ఆయకట్టుకు నీరందిస్తున్నారు. మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పంపింగ్ స్కీమ్‌కు మరమ్మతులు చేయించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసేవారు. ఈ స్కీమ్ ద్వారా సుమారు 4,500 ఎకరాలకు నీరందేది. ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వెంచర్ల వెలియడంతో ప్రస్తుతం 2,200 ఎకరాలు మాత్రమే ఉంది. దీంతో పంపింగ్ స్కీమ్ ద్వారా ఉన్న ఆయకట్టుకు మాత్రమే నీరందిస్తున్నారు.

పూడుకుపోయిన కాలువలు

పంపింగ్ స్కీమ్ శిథిలావస్థకు చేరడంతో పాటు కాలువలు పూడికపోవడంతో పొలాలకు పూర్తిస్థాయిలో నీరందడం లేదని రైతులు జక్కంపూడి రాజా, చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకువచ్చారు. పంపింగ్ స్కీమ్‌లోని రెండు 60 హెచ్‌పీ మోటార్లు పూర్తిస్థాయి సామర్థ్యం లేవన్నారు. పంపింగ్ స్కీమ్ ఆవరణలో విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు ఆధునీకరించేందుకు రూ.3.20 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.

> **ఆధునీకరించాలి**
>
> పాత వెంకటనగరం పంపింగ్ స్కీమ్ శిథిలావస్థకు చేరింది. ఖరీఫ్‌లో అయకట్టుకు నీరు విడుదల చేసినప్పటికీ పూర్తిస్థాయిలో అందడం లేదు. కాలువలను, పంపింగ్ స్కీమ్‌ను ఆధునీకరించాలి. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. – చిట్టూరి వెంకటరావు, తొర్రేడు సొసైటీ చైర్మన్
>
> **రూ.3.20 కోట్లతో ప్రతిపాదనలు**
>
> పాత వెంకటనగరం పంపింగ్ స్కీమ్ ఆధునీకరించేందుకు, సబ్‌స్టేషన్, ప్రహరీ నిర్మాణానికి రూ.3.20 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. వీటికి ఆమోదం లభించిన వెంటనే పనులు చేపట్టడం జరుగుతుంది. – ప్రసన్న కుమార్, ఇరిగేషన్ ఏఈ

నర్సరీ సందర్శన

కడియం: మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ బుధవారం కడియపులంకలోని శ్రీసత్యదేవ నర్సరీని సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు ఆయనకు మొక్కను అందించి స్వాగతం పలికారు. వివిధ రకాల మొక్కలను గురించి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో నర్సరీ రైతులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న రైల్వే ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగుల జీవితాలకు ఇబ్బందికరంగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఆర్‌ఎఫ్ ఆదేశాలతో స్థానిక మెముకార్ షెడ్ క్యాంటీన్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు కె.విజయ కుమార్, డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చేవరకు ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.

ఆర్థిక అంశాలపై అవగాహన అవసరం

కంబాలచెరువు: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఆర్థిక వనరులు, అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఉద్దేశంతో ఆల్ ఇండియా ఫైనాన్షియల్ లిటరసీపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు క్విజ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ డీవీ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయిలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ అందరికీ సాధారణ పొదుపు వివరాలు, ఆదాయ, వ్యయాలు, బేసిక్ బ్యాంకింగ్, డిపాజిట్లు, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు, చెక్ బుక్, వివిధ రకాల బ్యాంకు ఖాతాలు, బ్యాంకుకు సంబంధించిన మౌలిక భావనలు, డిజిటల్ పేమెంట్స్ వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండేలా ఈ క్విజ్ నిర్వహించామన్నారు. కార్యక్రమానికి పరిశీలకులుగా అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ వ్యవహరించారు. మొత్తం 22 పాఠశాలల నుంచి స్కూల్‌కి ఇద్దరు విద్యార్థులు, ఒక గైడ్ టీచర్ హాజరయ్యారు. ప్రథమ బహుమతిని జి.స్మైలీ, డి.జయనాగదుర్గాదేవి (లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల), ద్వితీయ బహుమతిని దుర్గాశరణ్, బి.లీలాశరణ్ (క్వారీపేట ఉన్నత పాఠశాల), తృతీయ బహుమతిని ఎం.సాయిలోకేష్, ఎం.అభిషేక్ (చున్నీలాల్ పాఠశాల) గెలుచుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్, నోడల్ ఆఫీసర్ పి.సత్య కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

రాజానగరం: భారతీయ సంస్కృతిలో మానవ విలువలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని గైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ అన్నారు. వెలుగుబందలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ సహకారంతో సార్వత్రిక మానవ విలువలు అనే అంశంపై మూడు రోజులుగా జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ బుధవారంతో ముగిసింది. శర్మ మాట్లాడుతూ బీటెక్ చదువుతున్న విద్యార్థులకు మానవ విలువలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో మూడు క్రెడిట్స్‌తో కూడిన ఈ కోర్సును ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.సునీల్‌కుమార్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్.లీలావతి, డాక్టర్ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, డైరెక్టర్ డాక్టర్ వి.కుసుమకుమారి, ప్రొఫెసర్ గీత, ప్రొఫెసర్ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు


డాక్టర్ వెంకటేశ్వర్లుకు సమస్యలు వివరిస్తున్న రైల్వే ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఆయన రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ పరిధిలోని పలు విభాగాలను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. రైల్వే హెల్త్ సెంటర్, హెల్త్ రిన్యూవ్యాన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రతినిధులు రైల్వే ఉద్యోగులు వైద్యపరంగా పడుతున్న ఇబ్బందులపై వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉద్యోగులకు ఆదిత్య, రాజు న్యూరో ఆస్పత్రులు వైద్యసేవలు అందిస్తున్నాయని, అదనంగా ఆర్యాపురంలోని సాయి హాస్పిటల్‌ను రిఫరల్ ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని కోరారు. ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు అరవ నాగేంద్ర కుమార్, ఎస్ఎస్ చంద్రమౌళి, మజ్దూర్. యూనియన్ కె.విజయ్ కుమార్, డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అబ్రహం

కంబాలచెరువు: వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో నాడు – నేడు పనులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఆదేశించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంఈఓ – 2, రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలానికి కేటాయించిన ఎంఈవో – 2లు సమగ్ర శిక్షా కార్యక్రమాలు, జగనన్న గోరుముద్ద, జేవీకే కిట్ల పంపిణీ, వేలిముద్రలు నూరుశాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. వార్డు ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాఠశాల ఆవాస ప్రాంతంలో బడిఈడు బాలలు విధిగా బడిలో చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయ ఏడీ వెంకటరాజు, సమగ్ర శిక్షా ఏఎంఓ గౌరీశంకర్, సీఎంవో శ్రీనివాసరావు, ప్లానింగ్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించండి

రాజమహేంద్రవరం సిటీ: 2023–24 మొదటి అర్ధ సంవత్సరం ఆస్తిపన్నును అపరాధ రుసుం లేకుండా ఈనెల 30వ తేదీ వరకూ చెల్లించే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ఆస్తిపన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ స్పెషల్ కౌంటర్, సంబంధిత వార్డు సచివాలయం, ఆన్‌లైన్, పురసేవా యాప్, చెక్కులు, డీడీల ద్వారా ఆస్తిపన్నును చెల్లించవచ్చన్నారు.

నరసన్న ఆలయ అభివృద్ధికి సహకరించాలి


జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సుబ్బారెడ్డిని కలిశారు. గతంలో కోరినట్టుగా ఆలయంలో ఐదు అంతస్తుల రాజగోపురం నిర్మాణం, కొండపైన ప్రాకార మండపం, రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. ఈ నిర్మాణ పనుల నిమిత్తం నిధులు మంజూరు చేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారు.

అనాథలైన చిన్నారులకు ప్రభుత్వ సాయం


రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సాయాన్ని అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి, అనాథలైన ఇద్దరు చిన్నారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆర్థిక సాయాన్ని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి బుధవారం అందజేశారు. గతంలో కాకినాడ ఏడీబీ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో లాలాచెరువు హెచ్‌బీ కాలనీకి చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు మృత్యువాతపడ్డారు. వారిలో వనమూడి వీరేంద్ర అవినాష్ (12), దేవిప్రియ (10) తల్లిదండ్రులు కూడా ఉన్నారు. కాగా.. పిల్లల చదువుకు సాయమందించి, తోడుగా నిలవాలని ఇటీవల కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు విన్నవించుకున్నారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, ఒక్కొక్కరికీ రూ. ఒక లక్ష ఆర్థిక సాయాన్ని మంజూరు చేసేలా కృషి చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కులను రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జక్కంపూడి విజయలక్ష్మి ఆ చిన్నారులకు అందజేశారు. ఎల్లప్పుడు అండగా ఉంటామనే భరోసాను అందించారు.

నేటి నుంచి రీసర్వే

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం, జంబూపట్నం, బూరుగుపూడి గ్రామాల్లో గురువారం నుంచి భూ రీసర్వే చేయనున్నట్టు తహసీల్దార్ పాపారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సర్వేకు రైతులు సహకరించాలన్నారు.

నిత్య సాధనతో ఉపయోగాలెన్నో..

- కొనియాడిన వక్తలు
- ఘనంగా యోగా దినోత్సవం


యోగాభ్యాసకులతో రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు

సీటీఆర్ఐ: నిత్యం యోగాను సాధన చేయడం ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం జేఎన్ రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. షర్మిలారెడ్డి మాట్లాడుతూ యువత ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని, అందుకు యోగా అద్భుతమైన ప్రక్రియ అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఆయుష్ శాఖకు, జిల్లా యంత్రాంగానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ నిత్యం యోగా అభ్యాసం చేయడం వల్ల ఒత్తిడిని తగ్గుతుందన్నారు. యోగా అభ్యాసకులు మాట్లాడుతూ రోజుకు కనీసం 10 నుంచి 30 నిమిషాలు యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ కె. విజయ కుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● స్థానిక వెంకటేశ్వర నగర్‌లోని జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా ట్రైనర్ ఎస్.లీలా సుందరీ క్లబ్ సభ్యులకు యోగా విశిష్టతను తెలియజేశారు. క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● బీజేపీ అర్బన్ కార్యాలయంలో సిటీ కన్వీనర్ వై.రంగారావు మాట్లాడుతూ మన ప్రాచీన యోగాకు అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకుని రావడంలో ప్రధాని మోదీ చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాము, బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి పాల్గొన్నారు.

● వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో దానవాయిపేట గాంధీ పార్కు ఆవరణలో యోగా గురువు సూరపరెడ్డి తాతారావు, బాపూజీ క్లబ్ సభ్యులతో సూర్య నమస్కారాలు, ప్రాణాయామం చేయించారు.

ఛాత్రోపాధ్యాయుల యోగాసనాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ(డైట్)లో ఛాత్రోపాధ్యాయులు వివిధ యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం చేశారు. వారం రోజులుగా వివేకానంద రాక్ మెమోరియల్ కేంద్రం, కన్యాకుమారి రాజమహేంద్రవరం శాఖ ఇన్‌చార్జి, యోగాశిక్షకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఛాత్రోపాధ్యాయులకిచ్చిన శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేవీ సూర్యనారాయణ మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు నేర్చుకున్న యోగా శిక్షణ నిరంతరం సాధన చేయాలన్నారు. పీడీ వీరభద్రరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డైట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత

ధవళేశ్వరం: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ మాట్లాడుతూ యోగాను రోజు వారీ దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుకన్య, డీపీహెచ్‌ఎన్‌వో వసంతలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శేషామణి, పీహెచ్‌ఎన్ రమాదేవి పాల్గొన్నారు.

● యోగాతో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని లక్ష్మీగణేశ్వర ప్రకృతి వైద్యశాల వైద్యురాలు హేమలత అన్నారు. వివేకానంద మిత్రమండలి ఆధ్వర్యంలో బుధవారం ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ ఆవరణలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యోగాగురువు తలాటం సూర్యప్రకాశరావు ఆసనాలను సాధన చేయించారు. కార్యక్రమంలో న్యాయవాది వల్లూరి సురేష్, డాక్టర్ జి.కొండలరావు, వి.రామునాయుడు, ఉడతా శ్రీరాములు, ముళ్లపూడి భవాని, కోలపాటి వేణి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మేలు

కంబాలచెరువు: యోగా ద్వారా శారీరక మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని విశ్రాంత డైట్ లెక్చరర్, స్కౌట్ రాష్ట్ర కార్యదర్శి రమణ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రమణ విద్యార్థుల చేత యోగాసనాలు వేయించి, వాటి ఫలితాలను వివరించారు. ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, యోగా ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, స్కౌట్ ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణమోహన్, ఉపాధ్యాయులు విజయ కుమారి (రెడ్ క్రాస్) పాల్గొన్నారు.

● కేంద్రకారాగారంలో ఖైదీలతో యోగాసనాలు, సూర్యనమస్కారాలను జీవిత శిక్ష అనుభవిస్తున్న కట్టా భవానీకుమార్ చేయించారు. జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ మాట్లాడుతూ జైలు అధికారుల చొరవతో యోగాభ్యాసం చేసి, ఇతర ఖైదీలకు భవానీ కుమార్ ఆదర్శంగా ఉన్నాడన్నారు. ఉప పర్యవేక్షణాధికారి ఎం.రాజకుమార్, సంక్షేమ అధికారి ఆర్.శ్రీనివాసులు, జైలర్లు సీహెచ్ రమేష్, డిప్యూటీ జైలర్లు ఆర్.వీరబాబు, కె.అశోక్, టి.రామకృష్ణ పాల్గొన్నారు.


కేంద్ర కారాగారంలో యోగా చేస్తున్న ఖైదీలు


ధవళేశ్వరంలో యోగాసనాలు వేస్తున్న తలాటం సూర్యప్రకాశరావు


ధవళేశ్వరం పీహెచ్‌సీలో యోగా సాధన చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావు తదితరులు

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సీతానగరం: ఇనుగంటివారిపేటకు చెందిన వేమగిరి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఎస్టీ, ఎస్సీ కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు. నాగరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత నెలలో వెదుళ్లపల్లికి చెందిన బొల్లి ఆనంద్ కృష్ణారావు పనికి కిరాయికి వెళ్లాడు. కిరాయి డబ్బులు కోసం వెళ్లిన నాగరాజుపై దాడి చేసి, కులం పేరుతో దూషించారు. ఈ నేపథ్యంలో బొల్లి ఆనంద కృష్ణారావు, బొల్లి పుల్లారావుపై ఎస్టీ, ఎస్సీ కేసు నమోదు చేశారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం

అనపర్తి: వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. రామవరం, కుతుకులూరు గ్రామాల్లో కౌలు రైతులకు మంజూరైన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతు గుర్తింపు కార్డుల (సీసీఆర్‌సీ)తో ప్రభుత్వం అందించే సాయానికి అర్హత పొందుతారన్నారు. కుతుకులూరు సర్పంచి గొల్లు హేమతులసి సురేష్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, రామవరం వీఆర్వోలు జి.శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.